

మళ్లీ ఏడి‘పింఛెన్’

ఇచ్ఛాపురంలో ఆరుగురి పింఛన్లు ఆపేశారు. వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 8లో



అపార్ట్‌మెంట్‌లో చోరీ

శ్రీకాకుళంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. నాలుగున్నర తులాల బంగారం చోరీ చేశారు.

- 8లో

రేపటి నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ 5, 3వ సెమిస్టర్ ప్రాక్టికల్స్ ఈ నెల నాలుగు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో సమాచారం అందుబాటులో ఉంచారు. ఐదో సెమిస్టర్‌కు సంబంధించి ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు, 3వ సెమిస్టర్ 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

బాలికపై లైంగికదాడికి యత్నం

మెళియాపుట్టి : మండలంలోని కొళిగాం పంచాయతీ పరిధి తంగిణి గ్రామానికి చెందిన ఓ బాలికపై యువకుడు లైంగికదాడి చేయడానికి ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ యువకుడు బాలికకు వరుసకు అన్నయ్య అవ్వడం గమనార్హం. పాతపట్నం సీఐ వానపల్లి రామారావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ బాలిక బుధవారం సైకిల్‌పై గ్రామానికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు దారిలో అడ్డగించాడు. తెలిసిన వాడే అని బాలిక ఆగడంతో తన చెడుబుద్ధి చూపించడానికి ప్రయత్నించాడు. దీంతో బాలిక బిగ్గరగా కేకలు వేసింది. ఇంతలోనే తోటి విద్యార్థులు వెనుక నుంచి రావడంతో అతడు పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో వారు యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి గొడవపడ్డారు. పెద్ద మనుషుల సమక్షంలో న్యాయం జరిపించాలని కోరినా అది కాకపోవడంతో శనివారం మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దాంతో యువకుడిని పాతపట్నం సీఐ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొత్త విద్యుత్ మీటర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి రూరల్: టెక్కలి మండపాలం కాలనీకి చెందిన బి.కామేశ్వరరావు అనే రోజు కూలీకి కరెంట్ బిల్లు అధికంగా వచ్చిందని ‘సాక్షి’ ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖాధికారులు ఆ బాధితుడి ఇంటికి వెళ్లి కొత్త మీటర్‌ను ఏర్పాటు చేశారు. బాధితులు కొన్ని రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు కరుణించలేదు. పత్రికలో రావడంతో తన సమస్యను పరిష్కరించారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

జవాన్‌కు ఘన స్వాగతం



వాహనంపై జాతీయ జెండాలతో సైనికుడు పద్మనాభం ఊరేగింపు

కాశీబుగ్గ: మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన భావన పద్మనాభం అనే భారత సైనికుడికి గ్రామస్తులు శనివారం ఘన స్వాగతం పలికారు. ఆయన ఆర్మీలో ఏసీబీ నాయక్ సుబేదార్‌గా 26 ఏళ్ల పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బాలిగాం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రైల్వేస్టేషన్ నుంచి ఘనంగా సత్కరించి ఊరేగింపుగా ఇంటికి తీసుకువచ్చారు.

ఊరి మధ్యలో మద్యం షాపు వద్దు



ఎక్సైజ్ సీఐ అనురాధదేవికి వినతి పత్రం అందజేస్తున్న పైడిభీమవరం మహిళలు

రణస్థలం: పైడిభీమవరం గ్రామం మధ్య ఉన్న మద్యం షాపులు అక్కడి నుంచి తొలగించాలని పైడిభీమవరం మహిళలు రణస్థలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అనూరాధదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత ప్రభుత్వ సమయంలో మద్యం దుకాణాలు ఊరి మధ్యలో ఉన్నాయంటూ కూటమి నాయకులు నిరసన తెలిపి ఆందోళన చేశారని, ఇప్పుడు వారే స్వయంగా ఊరి మధ్యలో మద్యం షాపులు ఎలా పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ దారిలోనే పాఠశాలలకు పిల్లలు వెళతారని, ఈ స్థలంలోనే సామూహిక మరుగుదొడ్లు ఉన్నాయని అన్నారు. షాపులను గ్రామ శివారులో ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ సీఐను కోరారు.

SUNDAY SPECIAL



ముక్క లేకున్నా ముద్ద దిగుద్ది



హరాబరా కబాబ్

ముక్కకు అలవాటు పడిన నోటికి మష్రూమ్‌తో ఈ నెల రోజుల పాటు నేస్తరికం కట్టొచ్చు. కార్తీకంలో జిహ్వా చాపల్యం తగ్గిపోతుందని తెగ బాధ పడుతుంటే పన్నీరుతో ఆ కన్నీరు తుడవచ్చు. నేను తందూరీ మాత్రమే తింటా అని పట్టుబడితే.. వాళ్ల కోసం నిప్పులపై కాలేందుకైనా ఇవి వెనుకాడవని నిస్సందేహంగా చెప్పొచ్చు. కార్తీకంలో నాన్‌వెజ్ ఉండదని బాధ పడేవాళ్లకు విభిన్న రకాల వెజ్ రుచులను చెఫ్‌లు సిద్ధం చేస్తున్నారు. కాలీఫ్లవర్లు, కార్న్‌లు, రకరకాల పండ్లతో సరికొత్త రుచులను ఆవిష్కరిస్తున్నారు. ఇక ఆస్వాదించడం మనవంతు. -శ్రీకాకుళం,టెక్కలి

- కార్తీకంలో శాకాహారంతో సరికొత్త రుచులు
- నాన్‌వెజ్‌కు ప్రత్యామ్నాయంగా పన్నీరు, మష్రూమ్‌లతో వంటకాలు
- అన్ని రకాల పండ్లతోనూ వెరైటీలు

ఇష్టంగా లాగించేస్తా..

తందూరీ వంటకాలంటే నాకు ఎంతో ఇష్టం. రెస్టారెంట్‌కు వెళ్లగానే ముందుగా నేను ఆర్డరిచ్చేది వాటినే.. - పూజ, శ్రీకాకుళం

అందరూ మెచ్చేలా..



ఎప్పటికప్పుడు కొత్త రుచులు అందించేలా ఆలోచిస్తుంటాం. మరిన్ని కొత్త రుచుల్ని అందుబాటులోకి తీసుకువస్తాం. - రాము, చెఫ్, జీషాన్

వెజ్‌కూ ఉందో తందూరీ..



తందూరీ అనగానే అందరికీ మాంసాహారమే గుర్తుకు వస్తుంది. కానీ శాకాహారంతోనూ తందూరీ తయారు చేయవచ్చని మన చెఫ్‌లు చెబుతున్నారు. పన్నీరు, మష్రూమ్‌తో పాటు పలు రకాల కూరగాయలు, పండ్లతో తందూరీలు తయారు చేసి అందిస్తున్నారు. బొగ్గులు వినియోగించి ప్రత్యేక బట్టీ ద్వారా వేడితో కాల్చి ఇవ్వడమే తందూరీలోని వంట విధానం. ఇలా వేడి ద్వారా కాల్చడం ద్వారా ఆయా వంటకాలకు ప్రత్యేక రుచి వస్తుంది. పన్నీరును వినియోగించి పన్నీరు టిక్కా, మలై టిక్కా, జఫ్రాని పన్నీరు టిక్కా, మిర్చివాలా పన్నీరు టిక్కా, మష్రూమ్‌తో మష్రూమ్‌టిక్కా, కలంజి మష్రూమ్ టిక్కా అందజేస్తున్నారు.

పత్రాలు, ఫలాలతో..

పన్నీరు, మష్రూమ్‌లు మాత్రమే కాదు కూరగాయలను వినియోగించి గోబీ టిక్కా, అలూ టిక్కా, గోబీ మలై టిక్కా, హర్యాలీ గోబీ వంటి వాటిని భోజన ప్రియులకు అవసరమైన రుచులతో అందజేస్తున్నారు. ఇక పండ్లతో తయారుచేసే తందూరీలకైతే ఎందరో ఫ్యాన్స్ ఉన్నారు. హరాబరా కబాబ్, ఖజానా వంటి వంటకాలు ఆకట్టుకుంటున్నాయి.

పిక్నిక్ స్పెషల్స్ ఎన్నో..

ప్రత్యేకించి వన భోజనాల కోసం క్రిస్పి కార్న్, చిల్లీ మష్రూమ్, పన్నీర్-65 వంటి స్టాటర్లు మొదలుకుని పన్నీర్ బటర్ మసాలా, పన్నీర్ కుర్మా, పాలక్ పన్నీర్, కడాయ్ వెజ్ వంటివెన్నో రెడీ చేస్తున్నారు.

తందూరీలోనే 20 రకాలు..

తందూరీలో 20కి పైగా వంటకాలను అందుబాటులో ఉంచాం. ఈ కార్తీక మాసంలో మరో ఐదు కొత్తరకాలు ప్రారంభించేందుకు నిర్ణయించాం. - రాజేష్ దాస్, చెఫ్, నార్తర్న్ సిర్కార్స్

నాన్‌వెజ్ ప్రియులు మెచ్చేలా..



కార్తీకమాసం కావడంతో అధిక శాతం వెజ్ వంటకాలను ఇష్టపడతారు. అయితే వెజ్ ప్రియులతో పాటు నాన్‌వెజ్ ప్రియులకు ఇష్టపడేలా వెజ్ వంటకాల్లో అనేక రకాల డిష్‌లను అందజేస్తాం. - బాబు మాస్టార్, సీనియర్ చెఫ్, టెక్కలి.

బామ్మ గారు.. ఇరగదీస్తున్నారు

ఏ కల్మషం లేని స్వచ్ఛమైన మనసు.. ఏ ఆర్భాటం లేని అచ్చమైన సిక్కోలు వర్చస్సు.. కలగలిపితే కర్రి అప్పలమ్మ. ఓ రోజు చిరంజీవిలా, మరో రోజు ప్రభాస్‌లా, ఇంకోరోజు మహేష్ బాబులా.. అప్పలమ్మ డైలాగులు చెబుతుంటే కళ్లప్పగించి సెల్ చూడాల్సిందే. ఊరికే పేరు చెబితే గుర్తు పట్టలేరేమో గానీ.. ఆమె రీల్స్ చూస్తే మాత్రం మర్చిపోలేరు. మనవడితో కలిసి నెట్టింట అప్పలమ్మ చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. సినిమాల్లో ఫేమస్ డైలాగులను చెబుతూ తెగ అలరిస్తున్నారు. సరదాగా మొదలుపెట్టిన ఈ ప్రయత్నం ఆమెకు ఖ్యాతిని తెచ్చి పెడుతోంది.

- ఏడు పదుల వయసులో రీల్స్ చేస్తున్న బామ్మ
- హీరో, విలన్స్ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేస్తున్న వృద్ధురాలు



బామ్మ అప్పలమ్మ



ఇచ్ఛాపురం రూరల్/కవిటి:

‘వయొలెన్స్.. వయొలెన్స్.. వయొలెన్స్..’ అని రాకీ భాయ్ స్టైల్‌లో బామ్మ చెబుతుంటే చూసి నవ్వుకోని వారంటూ ఉండరు. ‘అన్నయ్యా.. ఈ తొక్కలో మీటింగేంటో అర్థం కావడం లేదు’ అని పండుగాడిని అనుకరిస్తూ చెబితే ఆనందించని మహేష్ బాబు ఫ్యాన్ ఉండడు. ‘టాయిలెట్స్ ఎక్కడున్నాయో నన్నడుగుతున్నావేంటి సుధా వీడు’ అని కోపంగా బామ్మ అంటుంటే లైక్ కొట్టకుండా ఉండలేరు. సామాజిక మాధ్యమం వేదికగా ఇంటిల్లిపాదినీ అలరిస్తున్నారు కర్రి అప్పలమ్మ. యూట్యూబ్‌లో సొంతంగా ఒక వేదికను ఏర్పాటు చేసుకుని చక్కటి కంటెంట్ క్రియేట్ చేస్తున్నారు. కవిటి మండలం పెద్ద కర్రివానిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన కర్రి అప్పలమ్మ అంటే ఇప్పుడు ప్రపంచమంతా పరిచయమే. బడి ముఖం కూడా చూడని అప్పలమ్మ ఇప్పుడు జిల్లా అంతా ఫేమస్ అయిపోయారు. తన మనవడు, అతడి స్నేహితులతో కలిసి 125 వరకు రీల్స్ చేశారు.

సమ్‌థింగ్ స్పెషల్

జీవితమంతా కష్టపడి..

కర్రి అప్పలమ్మ జీవితమంతా ముళ్లబాటలోనే సాగింది. చిన్నతనంలో పెళ్లి చేసుకొని సముద్రం నుంచి భర్త తెచ్చిన చేపల్ని ఊరూరా అమ్ముతూ ఇద్దరు కొడుకులు, ఒక కూతురికి పెళ్లిళ్లు చేసింది. అస్వస్థతతో ఇంటి పట్టునే కుటుంబసభ్యులతో ఉంటోంది. కరోనా సమయంలో బడికి సెలవులు ఇవ్వడంతో మనవడు కర్రి శివ తన స్నేహితులతో సరదాగా మొబైల్‌లో ఫైట్స్ సీన్స్ చేసి యూట్యూబ్ చానెల్స్‌లో, వాట్సాప్‌లో అప్‌లోడ్ చేశావాడు. అనుకోకుండా ఒకరోజు అప్పలమ్మతో సరదాగా ఫైట్ సీన్ చేయాలని అనుకున్నారు. అనుకున్నది తడువుగా శివ తన నాన్నమ్మను ఒప్పించాడు. కేజీఎఫ్ సినిమాలోని ‘వయలెన్స్ వయలెన్స్ ఐ డోంట్ లైక్ ఇట్’ కామెడీ సీన్ చేసేందుకు స్నేహితులు సాధూరు బాలు, సాధూరు నానితో కలిసి ప్లాన్ చేశాడు. పలుమార్లు వీడియో చూపించి అచ్చం అదే మాదిరి పెదవులు కదుపుతూ నటించమన్నారు. అంతే బామ్మ అప్పలమ్మ నటించడం బదులు ఆ సీన్‌లో జీవిస్తూ కామెడీ సీన్‌ను పండించింది. ఈ సన్నివేశాన్ని ముగ్గురు స్నేహితులు ‘అప్పుబాలు అఫీషియల్’ యూట్యూబ్ చానెల్‌ను ఏర్పాటు అందులో అప్‌లోడ్ చేశారు. అంతే వారం రోజుల్లో 30వేల మంది ఈ వీడియోను చూసి మెచ్చుకున్నారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న ఈ ముగ్గురు స్నేహితులు 2020 నుంచి 24 వరకు అప్పలమ్మచేత 125 వరకు రీల్స్ చేసి, లక్షకు పైగా వ్యూస్‌ను సంపాదించుకున్నారు.



మనవడితో కలిసి రీల్స్ షూటింగ్‌లో అప్పలమ్మ

అలవోకగా పరకాయ ప్రవేశం..

ఇంద్ర సినిమాలో చిరంజీవిలా, ఛత్రపతిలో ప్రభాస్‌లా, పుష్పలో అల్లు అర్జున్‌లా, మగధీరలో రామ్ చరణ్‌లా, అపరిచితుడులో విక్రమ్‌లా... ఇట్టే ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తోంది అప్పలమ్మ. ఛత్రపతి, మగధీర, మిర్చి, అపరిచితుడు, సరైనోడు, పోకిరి, విక్రమార్కుడు, కాంచన, ఇంద్ర, బిజినెస్‌మెన్, మాస్టర్, రాయన్, సరిపోదా శనివారం చిత్రాల డైలాగులు తన నాన్నమ్మకు మంచి పేరుతో పాటు అధిక వ్యూస్ తెచ్చిపెట్టాయని శివ చెబుతున్నాడు. ఈ సందర్భంగా అప్పలమ్మ ‘సాక్షి’తో మాట్లాడుతూ మొదట్లో నటించేందుకు భయపడ్డానని, అయితే తాను నటించిన వీడియోలో నా నటనను తానే చూసుకొని మురిసిపోయేదాన్నని, గ్రామస్తులతో బంధువులు సైతం మెచ్చుకోవడంతో కష్టమైనా నటించేందుకు నా మనవళ్లతో వెళ్తుంటానని చెబుతోంది. దాతలు ముందుకు వచ్చి తమకు సహాయంగా నిలిస్తే లఘు చిత్రాలు తీసేందుకు సిద్ధంగా ఉన్నామని శివ, బాలు, నాని చెబుతున్నారు.

ఆడబిడ్డలకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసలో జరిగిన అత్యాచార ఘటనపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించి ఆవేదన వ్యక్తం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన శనివారం పలాసలో బాధిత కుటుంబానికి రూ.పదిలక్షల చెక్‌ను అందించి అనంతరం మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అభ్యర్థన మేరకు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశామని, ఆడబిడ్డలకు అండగా ఉంటామని వైఎస్ జగన్ పంపిన సందేశాన్ని వారికి తెలియజేశామని చెప్పారు. నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వం వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని అన్నారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ వేసి ఫోర్ వీలర్లు, ఆటోలపై టాక్స్‌లు విపరీతంగా పెంచారని తెలిపారు. గతంలో రూ.పదిహేను వందలు ఉన్న టాక్స్ నేడు కూటమి ప్రభుత్వం రాకతో రూ.ఆరువేలకు పెరిగిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి నాలుగు నెలల్లోనే భారీగా పెంచడం అన్యాయమన్నారు. గ్రామ స్వరాజ్యం వైఎస్ జగన్ పాలనలోనే వర్ధిల్లిందని, ఉద్దానం ప్రాంతానికి ఏ నాయకుడూ చేయనంత మంచిని వైఎస్ జగన్ చేసి చూపించారని అన్నారు. అందరూ మాటలు చెబుతుంటే పనులు మాత్రం వైఎస్ జగన్ చేశారని గుర్తు చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ధైర్యంగా గెలిచి చూపిద్దామన్నారు.

అనంతరం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలాస అత్యాచార సంఘటనపై ప్రభుత్వం ఏమీ చేయలేదని, బాధితులను ఆదుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. బాధితులకు తాము అండగా ఉంటామని చెప్పారు. నష్టపోయిన నాయకులు, కార్యకర్తలను ఆదుకుంటామని అన్నారు. ‘కొడుతున్నారు మేము తీసుకుంటున్నాము.. మా రోజు వచ్చినప్పుడు మేము బదులు తీర్చుకుంటామ’ని అన్నారు.



ప్రభుత్వం తరఫున నివాళులకు నోచుకోని నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం

అమరజీవిని విస్మరిస్తారా..?

- చంద్రబాబు తీరుపై విమర్శలు
- ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టని పొట్టి శ్రీరాములు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో రెండు రోజుల పర్యటించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున జిల్లాకు వచ్చారు. రాష్ట్రం కోసం ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములును ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన విగ్రహానికి లేదంటే చిత్రపటానికైనా పూలమాలలు వేసి నివాళులర్పించాల్సిన బాధ్యత అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులకు, ఇటు అధికారులకు ఉంది. కానీ రెండు రోజుల పర్యటనలో ఉన్న చంద్రబాబు నాయుడు ఏకంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మరిచిపోయారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములను పూర్తిగా విస్మరించారు. పర్యటనలో కనీసం నివాళులర్పించలేదు. తన తోటి నాయకుడు, దివంగత నేత కింజరాపు ఎర్రంనాయుడు వర్ధంతిని పురస్కరించుకుని తాను బస చేసిన ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రన్నకు నివాళులర్పించడం ఎంత అవసరమో అదే రీతిలో రాష్ట్రాన్ని తీసుకొచ్చిన పొట్టి శ్రీరాములకు నివాళులర్పించడం అంతే ప్రాధాన్యతగా తీసుకోలేదు. చంద్రబాబు ఈ విషయంలో వివక్ష చూపించారు. ఇప్పుడిది చర్చనీయాంశమైంది.



ఎర్రనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములుని రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబర్ 1న మరిచిపోవడంపై చంద్రబాబు సర్కార్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. శ్రీకాకుళం నగరంలో అడుగు పెట్టి, జెడ్పీలో సమీక్ష పెట్టి, అక్కడికి కూత వేటు దూరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలన్న ధ్యాస కలగలేదు. కనీసం ఆయన చిత్ర పటానికైనా పూలమాలలు వేసి నివాళులర్పించే ప్రయత్నం చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 నుంచి 2023 నవంబర్ 1 వరకు అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు విగ్రహాల చుట్టూ వారం రోజుల పాటు అలంకరణలు చేసేవారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన 2014 నుంచి 2019 వరకు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని విస్మరించారు. మళ్లీ అధికారంలోకి వచ్చినా అదే తీరు కనబరిచారు. ఇదే చంద్రబాబు దివంగత ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు వర్ధంతిని చేయడం తప్పుకాదు గానీ పొట్టి శ్రీరాముల్ని విస్మరించడం తప్పుగా ప్రజలు చెప్పుకుంటున్నారు. ముఖ్యమంత్రి సరే.. కనీసం మంత్రులు,అధికారులైనా పొట్టి శ్రీరాములకు నివాళులర్పించే ప్రయత్నం చేయలేదు. కనీసం గౌరవించే కార్యక్రమం చేపట్టలేదు. విచిత్రమేమిటంటే రాష్ట్రం ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు గానీ ఎర్రంనాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద అధికారులు ఏర్పాట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది.

చాలా బాధాకరం



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి గౌరవించకపోవడం చాలా బాధాకరం. 2014లో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు అధికారికంగా పొట్టిశ్రీరాములు జయంతి, వర్ధంతి, ఆంధ్ర రాష్ట్ర అవతరణను జరుపుకోవడం మానేశారు. అదేవిధంగా 2024లో అధికారంలోకి వచ్చాక అదే బాణీలో నడుచుకుంటున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటన్నింటిని అధికారికంగా జరిపించింది. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం చాలా బాధాకరం.

– తమ్మిన భాస్కర్, పొట్టి శ్రీరాములు స్మృతి పరిరక్షణ సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

గీతాజయంతి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు డిసెంబర్ 11న భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీతలోని ఆరో అధ్యాయం ఆత్మసంయమన యోగంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6,7 తరగతులు మొదటి గ్రూపుగా, 8, 9,10 తరగతులు రెండో గ్రూపుగా, 18 అధ్యాయాలు పూర్తిగా వచ్చినవారికి మూడో గ్రూపుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9866914160 నంబరును సంప్రదించాలని కోరారు.

భావనపాడు జెట్టీ పరిశీలన



జెట్టీని పరిశీలిస్తున్న ఎన్‌సీసీఆర్ శాస్త్రవేత్త సుధీర్

సంతబొమ్మాళి: మండలంలోని భావనపాడు జెట్టీ(తీర ప్రాంతం)ని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్‌సీసీఆర్) శాస్త్రవేత్త సుధీర్ శనివారం సందర్శించారు. సముద్ర ముఖ ద్వారం వద్ద ఇసుక మేటలను పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడి ఇసుక మేటల సమస్యను సాంకేతికంగా పరిష్కరించేందుకు నివేదిక అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావు, ఏడీ సత్యనారాయణ, టెక్కలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజ్‌పాత్రో, ఫిషరీస్ అసిస్టెంట్ ఎల్.దామోదర్, సాగరమిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

మళ్లీ ఏడిపించెన్

- నోటీసులు లేకుండా ఆరుగురి పెన్షన్లు నిలిపివేత
- ఆందోళనలో లబ్ధిదారులు



ఎమ్మెల్సీ నర్తు రామారావుకు ఫిర్యాదు చేస్తున్న బాధిత పింఛన్‌దారులు

ఇచ్ఛాపురం రూరల్: 'వీరికి పింఛన్ ఇవ్వాలంటే టీడీపీ సర్పంచ్ వద్దకు వెళ్లి కలవాలి. నా చేతిలో ఏమీ లేదు. ఆరుగురు పింఛన్‌కు అనర్హులంటూ తహసీల్దార్ నుంచి లేఖ వచ్చింది..' ఇవీ ఇచ్ఛాపురం ఎంపీడీఓ కె.రామారావు శనివారం ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ముందు చెప్పిన మాటలు. మశాఖపురం గ్రామానికి చెందిన బాకి కురమ్మ(వితంతు), దల్లి రామకృష్ణ(దివ్యాంగుడు), ఆశి దాలమ్మ(ఒంటరి మహిళ), కన్నింటి మోహినమ్మ(వితంతువు), అర్తికట్ల లోలమ్మ(ఒంటరిమహిళ)లకు పింఛన్ ఇవ్వకూడదని తనకు పై అధికారులు ఆదేశాలు జారీ చేశారంటూ నవంబర్ 1న పంచాయతీ కార్యదర్శి విజయకుమారీ పంపిణీ నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సెప్టెంబర్‌కు సంబంధించి పై ఐదుగురు లబ్ధిదారులతో పాటు నగిరెడ్ల తుంభనాధం(వృద్ధాప్య)కు ఎమ్మెల్యే బెందాళం అశోక్ చెప్పారంటూ అప్పటి ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు రెండు రోజుల పాటు పింఛన్‌ను నిలిపివేశారు. ఈ విషయమై అప్పట్లో ఎమ్మెల్యే, ఎంపీడీఓలకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఎట్టకేలకు ఎంపీడీఓ ఈశ్వరరావు చొరవతో తమకు అర్హతా పత్రాలు ఇవ్వాలంటూ కోరడంతో నగిరెడ్ల తుంభనాధం మినహా మిగతా ఐదుగురు పింఛన్‌దారులు అర్హతా పత్రాలను సంబంధిత అధికారికి సమర్పించడంతో వరుసగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల పింఛన్లు లబ్ధిదారులకు అందజేయడంతో వారంతా ఆనందపడ్డారు. ఆ ఆనందం నవంబర్ 1వ తేదీకి ఆవిరైపోయింది. ఈసారి అదే ఐదుగురికి సంబంధిత అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పింఛన్ నిలిపివేశారు. నవంబర్‌కు సంబంధించి పింఛన్ డబ్బులు ఈ ఐదుగురికీ వచ్చినా పింఛన్ ఇవ్వరాదని ఎంపీడీఓ కార్యాలయం నుంచి తనకు సమాచారం రావడంతో తానేమీ చేయలేనని పంచాయతీ కార్యదర్శి విజయకుమారి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ అర్హతా పత్రాలతో శనివారం ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు బోర పుష్ప, ఉప్పాడ నారాయణమ్మలను కలసి తమకు న్యాయం చేయాలని కోరారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

- నాలుగున్నర తులాల బంగారం అపహరణ
- సీసీ టీవీకి చిక్కిన నిందితుడి దృశ్యాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస శివారున హైటెక్ పేరడైజ్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. అపార్ట్‌మెంట్‌లోని 5వ ఫ్లోర్ మొదటి బ్లాక్‌లో ఫ్లాట్ నంబర్ 523లో నివాసం ఉంటున్న రామారావు కుటుంబ సమేతంగా శుక్రవారం శ్రీకాకుళంలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు తన ఫ్లాట్‌లో దొంగతనం జరిగిందంటూ వాచ్‌మేన్ జగన్మోహన్‌రావు ఫోన్‌లో సమాచారం అందించడంతో హటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని నాలుగున్నర తులాల బంగారు చెవిదుద్దులు, కాసులు, ఉంగరాలు చోరీకి గురయ్యాయని గుర్తించారు.

దొంగతనం ఎలా జరిగిందంటే..

అర్ధరాత్రి 12.33 గంటలకు దొంగ ప్రవేశించిన దృశ్యాలన్నీ సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. దుండగుడు ముందుగా గ్యాస్ గొడౌన్ వద్ద పిట్టగోడను దాటుకొని అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఫ్లాట్‌లో నివాసముంటున్న వ్యక్తిగా అన్ని ఫ్లోర్‌లను తిరిగాడు. కొత్త ముఖంలా కనిపించడంతో వాచ్‌మేన్‌కు అనుమానం వచ్చి ఆయన కదలికలను పరిశీలించాడు. అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించినపుడు ఒక రకం డ్రస్సుతో.. బయటకు వస్తున్నప్పుడు మరో డ్రెస్సు ధరించి రెండు బ్యాగులు సైతం పట్టుకొని ఉన్నాడు. ఇంతలో అపార్ట్‌మెంట్‌లో ఉన్నవారికి వాచ్‌మేన్ సమాచారం ఇచ్చాడు. రాత్రి 2.36 గంటలకు దొంగ మొదటి ఫ్లోర్ గుండా బ్యాగులను పట్టుకొని కిందకు దిగుతుండగా అపార్ట్‌మెంట్‌లో శబ్దాలు వినిపించడంతో బంగారం మాత్రమే ఉంచుకుని బ్యాగులను అక్కడే పడేసి గ్యాస్ గొడౌన్ ప్రహరీ దూకి పరారయ్యాడు. ఈ విషయమై రూరల్ ఎస్ఐ వద్ద ప్రస్తావించగా.. దొంగతనంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



సీసీ ఫుటేజీలో దుండగుడు

క్రీడా సమస్యలు కొలిక్కి వచ్చేనా?

- నేడు జిల్లాకు శాప్ ఛైర్మన్ రాక
- జీతాల కోసం ఎదురుచూస్తున్న డీఎస్ఏ కోచ్‌లు



నత్తనడకన సాగుతున్న కోడిరామ్మూర్తి స్టేడియం పనులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆదివారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో జరగనున్న 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి పాల్గొంటారు. అనంతరం కేఆర్ స్టేడియంతో జరుగుతున్న పనులతోపాటు నరసన్నపేట క్రీడా వికాస కేంద్రాన్ని సందర్శించనున్నారు. క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, కోచ్‌లతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం క్రీడాసంఘాలతో సమావేశమౌతారని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు.

సమస్యలపై దృష్టిసారించాలి..

అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే కోడిరామ్మూర్తి స్టేడియాన్ని పూర్తిచేస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వ పాలకులు ఇప్పటికీ సగం రోజులు పూర్తయినా.. కనీసం 30 శాతం పనులు కూడా పూర్తికాలేదు. క్రీడల ఖిల్లాగా పేరొందిన శ్రీకాకుళంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అవసరమని క్రీడాసంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. జిల్లాలో ఉన్న క్రీడావికాస కేంద్రాల నిర్వహణకు కనీస నిధులు లేవు. అక్కడ పూర్తిస్థాయిలో కోచ్‌లు అందుబాటులో ఉండటంలేదు. ఒకరో ఇద్దరో ఉన్నప్పటికీ కనీస మౌళిక సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. శాప్ కోచ్‌లు, డీఎస్ఏ పరిధిలో ఉన్న కోచ్‌లకు రెండు నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. గుర్తింపు లేని సంఘాలు పుట్టగొడుల్లా విస్తరిస్తున్నాయి. క్రీడాసంఘాలకు నిధులు కేటాయింపు కావడంలేదు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తే తప్ప.. క్షేత్రస్థాయిలో క్రీడాకారులకు కనీస ప్రోత్సాహకం, గుర్తింపు ఉండటంలేదు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహణ ఊసే లేకుండా పోయింది.

మూడు వాహనాలు ఢీ

- ఐదుగురు విద్యార్థినులకు గాయాలు



విద్యార్థినుల నుంచి వివరాలు సేకరిస్తున్న హెచ్‌సీ

నరసన్నపేట: జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై జమ్ము కూడలిలోని అయ్యప్ప హోటల్ వద్ద శనివారం మూడు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ముందుగా టెక్కలి వైపు నుంచి నరసన్నపేట వస్తున్న మార్గంలో టాటా మ్యాజిక్ వాహనాన్ని కారు ఢీ కొట్టింది. దీంతో టాటా మ్యాజిక్ వాహనం ముందున్న మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో డిగ్రీ, ఇంటర్మీడియెట్ చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు హిమబిందు, రమణమ్మ, ఆసిని, మమత, రేణుకలకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ సురేష్ శనివారం తెలిపారు. గత నెల 30న ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చేరిన ఈయన శుక్రవారం ఉదయం మరణించాడని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 6309990824, 6309990843 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఆమదాలవలస : మండలంలోని దివంజిపేట జంక్షన్ సమీపంలో అలికాం బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన జె.యర్రన్నాయుడు గాయపడ్డాడు. ఆమదాలవలస నుంచి తన ద్విచక్రవాహనంపై టీవీ కొనుగోలు చేసుకొని తీసుకువెళ్తుండగా ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బాధితుడిని 108లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బస్సును ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు. కేసు నమోదు చేయాల్సి ఉందని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

రేపు మహిళా కళాశాలలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్‌మేళాలో నాలుగు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఒరిజినల్ టీసీతో హాజరుకావాలని, వివరాలకు 94928 84824 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

డిసెంబర్ 7న రన్ ఫర్ జవాన్

శ్రీకాకుళం న్యూకాలనీ: జవాన్ కుటుంబాలకు అండగా నిలిచేలా డిసెంబర్ 7న ఆర్మీ ఫ్లాగ్ డే సందర్భంగా శ్రీకాకుళం నగరంలో 'రన్ ఫర్ జవాన్– 5కే రన్' పేరిట విరాళాల సేకరణ చేపడుతున్నట్లు కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, జిల్లా మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య జిల్లా నాయకులతో కలిసి శనివారం పోస్టర్ ఆవిష్కరించారు.